

పారా లీగల్ వాలంటీర్లకు శిక్షణ

ప్రజాశక్తి - కడప

జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కోర్టు లోని న్యాయ సేవా సదన్‌లో పారా లీగల్ వాలంటీర్లకు శిక్షణ, ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా సివిల్ సీనియర్ జడ్జి బాబా ఫక్రుద్దీన్ మాట్లాడుతూ పారా లీగల్ వాలంటీర్ పాత్ర, డ్రెస్ కోడ్, ప్రవర్తన, నీతి ప్రమాణాలు వంటి వాటిపై వివరించారు.

ప్యానెల్ న్యాయవాదులు నైపుణ్యాలను పెంచుకోవాలి

ప్యానెల్ న్యాయవాదులు తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్ అన్నారు. మంగళవారం జిల్లా కోర్టులోని న్యాయ సేవా సదన్ లో ప్యానెల్ న్యాయవాదులకు నైపుణ్యాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ ప్యానెల్ న్యాయవాదుల విధివిధానాలు, సివిల్ కేసులు, విధులు, సుప్రీంకోర్టు, హైకోర్టు తీర్పుల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు.

సార్వత్రిక సమ్మెకు సర్వం సిద్ధం



- ప్రజాసంఘాల సన్నాహాలు
- రోడ్డెక్కనున్న కార్మికులు, స్కీమ్ వర్కర్లు
- జయప్రదం చేయాలని ప్రచారాలు, కరపత్రాల ఆవిష్కరణ

జిల్లాలో సార్వత్రిక సమ్మెకు సర్వం సిద్ధమైంది. సిఐటియు, ఎఐటియుసి, ఐఎఫ్‌టియు సహా పలు వామపక్ష, కార్మిక, వ్యవసాయ కార్మిక, రైతు సంఘాల ఆధ్వర్యంలో పెద్దఎత్తున కార్మికులు, కర్షకులు, విద్యార్థి, యువజన, సంఘాలన్నీ ఒక్కతాటిపై ముందుకు కదులుతున్నాయి. బుధవారం దేశవ్యాప్తంగా తలపెట్టిన సార్వత్రిక సమ్మెకు వామపక్ష పార్టీలు సంఘీభావం ప్రకటించడం తెలిసిందే. కడప, అన్నమయ్య జిల్లాల్లో నిరసన ప్రదర్శనలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. కీలక కూడళ్లు, ప్రభుత్వ, పరిశ్రమల ఎదుట భారీ ర్యాలీలు, ధర్నాలు, నిరసన ప్రదర్శనల నిర్వహణకు కార్మిక, కర్షకలోకం సర్వం సిద్ధం చేసిన నేపథ్యం కార్మిక, కర్షక, శ్రమజీవుల్లో ఉత్సాహాన్ని నింపుతోంది.

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలో కార్మికుల నిరసనాగ్రహం పెల్లుబికుతోంది. కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాల పట్ల కార్మికులు కన్నెర్ర చేస్తున్న సంగతి తెలిసిందే. కార్మిక సంఘాల చట్టం-1926లోని 29 చట్టాలను కుదించి నాలుగు లేబర్‌కోడ్‌లుగా మార్చడం దగ్గర నుండి ఎనిమిది గంటల పనిదినాన్ని 10 గంటల నుంచి 14 గంటల వరకు పెంచడం, స్కీమ్‌వర్కర్ల కనీస వేతనం అమలుపై కార్మిక, కర్షక, శ్రామిక సంఘాల నుంచి తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. వామపక్ష కార్మిక, కేంద్ర కార్మిక సంఘాలన్నీ కలిసి సార్వత్రిక సమ్మెకు పిలుపునిచ్చాయి. బుధవారం కడప, అన్నమయ్య జిల్లాల్లో నిరసన ప్రదర్శనలు చేపట్టనున్నారు. కేంద్ర ప్రభుత్వ నిరంకుశ వైఖరికి వ్యతిరేకంగా లక్షలాది మంది కార్మిక, కర్షకలోకం రోడ్డెక్కుతోంది. కేంద్రం తెచ్చిన కార్మిక, కర్షక వినాశకర చట్టాలు, విద్యుత్ చట్టాలకు వ్యతిరేకంగా వామపక్ష పార్టీల ఆధ్వర్యంలోని కార్మిక, కర్షక సంఘాల ఆధ్వర్యంలో అఖిలపక్ష పార్టీల ప్రజాసంఘాలు కలిసి పెద్ద ఎత్తున ధర్నాలు, నిరసన ర్యాలీలు, ప్రదర్శనలతో హోరెత్తించనున్నాయి. బిజెపి 11 ఏళ్ల పాలనలో రైతాంగ, కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా కార్మికులు, కర్షకలోకం ముందుకు కదిలింది. పారిశ్రామిక, వ్యవసాయ వినాశకర చట్టాల ఉపసంహరణతోపాటు స్కీమ్‌వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని కోరుతూ కదం తొక్కనున్నారు. కేంద్ర ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిరసనగా కడప, అన్నమయ్య జిల్లాల్లోని అన్ని నియోజకవర్గాలకు చెందిన ప్రజాసంఘాల నాయకులు బాధ్యతలు పంచుకుని సమ్మెను జయప్రదం చేయడంపై దృష్టి కేంద్రీకరించడం నిరసన తీవ్రతకు అద్దం పడుతోంది. కేంద్ర ప్రభుత్వం కార్మిక, కర్షక, రైతు ప్రజావ్యతిరేక విధానాల అమలును ఉపసంహరించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పవచ్చు.

సార్వత్రిక సమ్మెకు సిపిఎం, ప్రజా సంఘాల సంపూర్ణ మద్దతు, ప్రచారాలు, కరపత్రాల ఆవిష్కరణ

దేశవ్యాపితంగా బుధవారం నిర్వహించే సార్వత్రిక సమ్మెకు యుటిఎఫ్ సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందని రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సిపిఎం నగర కమిటీ సార్వత్రిక సమ్మెకు సంఘీభావం తెలియజేస్తుందని నగర నగర కార్యదర్శి రామమోహన్ తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థలను, కార్మిక చట్టాలను నిర్వీర్యం చేసే కేంద్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ బుధవారం నిర్వహించే సమ్మెలో పాల్గొంటున్నట్లు ఎల్ఐసి ఉద్యోగుల సంఘం కడప డివిజన్ ప్రధాన కార్యదర్శి రఘునాథరెడ్డి, అధ్యక్షుడు అవధానం శ్రీనివాస్ ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని జమ్మలమడుగు సిఐటియు పట్టణ కార్యదర్శి దాసరి విజయ్ పిలుపునిచ్చారు. పట్టణంలో ఆయన సమ్మెకు సంబంధించిన బుక్‌లెట్స్‌ను ప్రజలకు పంపిణీ చేశారు. మైదుకూరులో సమ్మెకు సంబంధించిన కరపత్రాలను సిపిఎం మండల కార్యదర్శి షరీఫ్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. సమ్మెకు సిపిఎం మద్దతు తెలియజేస్తుందని ప్రొద్దుటూరు పట్టణ కార్యదర్శి సత్యనారాయణ తెలిపారు.

పేదరిక నిర్మూలనే ప్రభుత్వ ధ్యేయం : మంత్రి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి మంత్రి సవిత

ప్రజాశక్తి - కడప అర్బన్

సమాజంలో పేదరికాన్ని సమూలంగా దూరం చేసే లక్ష్యంతో ప్రణాళికలు రూపొందించిందని, సూపరిపాలంలో భాగంగా ప్రజాస్వామ్య బద్దంగా, ప్రజల కోసం పని చేస్తోందని ఆ దిశగా జిల్లా సమగ్ర అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో కృషి చేయాలని రాష్ట్ర వెనుకబడిన తరగతులు, బలహీన వర్గాల సంక్షేమ శాఖ, చేనేత జౌళి శాఖామంత్రి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఎస్.సవిత పేర్కొన్నారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాలులో కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సమీక్షా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉన్న అధికారులు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పథకాలు, కార్యక్రమాలను పూర్తిస్థాయిలో అందేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. గత ప్రభుత్వంలో జరిగిన నష్టాలను పూడ్చుకుంటూ, ఉద్యోగులకు జీతాలు అందిస్తూ రాష్ట్రంలో అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్న ముఖ్యమంత్రి రాష్ట్రంలో పేదరికాన్ని సమూలంగా తుడిచి పెట్టే లక్ష్యంతో పి4 కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో అమలు చేయాలన్నారు. కలెక్టర్ శాఖల వారీగా జిల్లాలో సాధించిన ప్రగతిని పవర్ పాయింట్ ద్వారా ఇన్‌ఛార్జి మంత్రికి వివరించారు. ఈ నెల 10 జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లోని పాఠశాలల్లో అత్యంత ప్రాధాన్యతతో పేరెంట్ కమిటీ మీట్స్ నిర్వహిస్తున్నట్లు ఈ కార్యక్రమాన్ని సంబందిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, పేరెంట్స్ ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో కమిటీ సభ్యులు అనేక అంశాలపై అధికారులతో సమీక్షించారు. సమస్యాత్మకంగా ఉన్న అనేక సమస్యలను మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం ఎమ్మెల్యేలు మాట్లాడారు. సమావేశంలో జెసిఅదితి సింగ్, డిఆర్ఒ విశ్వేశ్వర నాయుడు, అన్ని రెవెన్యూ డివిజన్ల ఆర్‌డిఒలు,అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

మహిళలను కించపరచడం మానుకోండి

ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిని కించపరిచేలా మాట్లాడిన వైసిపి నాయకుడు ప్రసన్నకుమార్‌రెడ్డి తక్షణమే క్షమాపణ చెప్పాలని మంత్రి, రాష్ట్ర సవిత డిమాండ్ చేశారు. నగరంలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌లో ఎమ్మెల్యే మాధవీతో కలిసి మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జగన్ కు, వైసిపి నాయకులకు మహిళలంటే గౌరవం లేదని, చులకనగా చూస్తున్నారని మండిపడ్డారు. సొంత తల్లిని, చెల్లిని ఆస్తుల కోసం ఇంటి నుంచి గెంటేయడమే కాకుండా కోర్టుకు ఈడ్చిన ఘనుడు జగన్‌రెడ్డి అన్నారు. బాబాయ్ కూతురు, మరో చెల్లెలు సునీతను కూడా ఏడిపిస్తున్నాడన్నారు. ఇంట్లో ఆడవాళ్లను గౌరవించని జగన్ రాష్ట్రంలో ఇతర మహిళలను ఏం గౌరవిస్తాడని ప్రశ్నించారు. మహిళా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డిపై వైసిపి నాయకుడు ప్రసన్నకుమార్ రెడ్డి నోరు పారేసుకోవడం దారుణమన్నారు. రాజకీయాలకతీతంగా మహిళలను తాము, తమ ప్రభుత్వం గౌరవిస్తుందని తెలిపారు.

ప్రజా సంక్షేమమే ముఖ్యం : మంత్రి

ప్రజాశక్తి-చెన్నూరు : ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని బిసి సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మ అన్నారు. చెన్నూరులో బెస్ట్ కాలనీ నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే కృష్ణ చైతన్య రెడ్డితో కలిసి ఆమె పాల్గొన్నారు. సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారు అన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన విధంగా దేశంలో ఎక్కడా లేనివిధంగా రూ. 4 వేల పింఛను ప్రతినెలా లబ్ధిదారులకు అందజేస్తున్నారన్నారు. కార్యక్రమంలో కమలాపురం శాసనసభ్యులు కృష్ణ చైతన్య రెడ్డి, మండల టిడిపి అధ్యక్షులు విజయ భాస్కర్ రెడ్డి, కమలాపురం మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ ఆకుల చలపతి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ శివారెడ్డి, పాలగిరి సుదర్శన్ రెడ్డి, ఆవుల పవన్ కుమార్ రెడ్డి, మార్కెట్ యార్డు డైరెక్టర్ కె.చెన్నయ్య అధ్యక్షులు సుబ్బారెడ్డి, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.


భారీ స్కోరు సాధించిన కడప జట్టు

ప్రజాశక్తి - కడప : ఎసిఎ సౌత్ జోన్ అండర్ -19 మల్టీ డే క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా మంగళవారం వైయస్ రాజా రెడ్డి ఎసిఎ స్టేడియంలో అనంతపురం జట్ల మధ్య మ్యాచ్ ప్రారంభమైంది. టాస్ గెలిచి బ్యాటింగ్ ప్రారం భించిన కడప జట్టు మొదటి ఇన్నింగ్స్ లో మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 88. 4 ఓవర్లలో 9 వికెట్లు నష్టానికి 461 పరుగులు చేసింది. ఆ జట్టులోని ప్రణీల్ రెడ్డి 108 (సెంచరీ), సుదర్శన్ 114 (సెంచరీ) చేశాడు. రోహిత్ వర్మ 85, ఆర్థిత్ రెడ్డి 70 (నా టౌట్) పరుగులు చేశారు. అనంతపురం జట్టులోని నవదీపు 3, వీరారెడ్డి 3 వికెట్లు తీసుకున్నారు.

కెఒఆర్ ఎం క్రికెట్ మైదానంలో ప్రారంభమైన వేరొక మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ప్రారంభించిన కర్నూలు జట్టు మొదటి ఇన్నింగ్స్ లో 282 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని సాయి గణేష్ 98, భార్గవ్ 54 పరుగులు చేశారు. చిత్తూరు జట్టులోని సాయి చరణ్ 4, కశప్ గని 2, సిరాజ్ 2 వికెట్లు తీసుకున్నారు. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన చిత్తూరు జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 4.0 ఓవర్లలో ఒక వికెట్ నష్టానికి 11 పరుగులు చేసింది.

కెవి స్కూల్‌కు అదనపు బస్సులు కేటాయించాలి

ప్రజాశక్తి కడప అర్బన్



వినతి పత్రం అందజేస్తున్న సభ్యులు

కేంద్రీయ విద్యాలయం స్కూలుకు మరో రెండు అదనపు బస్సులు కేటాయించాలని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సవితకు కేంద్రీయ విద్యాలయ స్కూల్ చిల్డ్రన్ పేరెంట్స్ అసోసియేషన్ నాయకులు వినతిపత్రం అందజేశారు. స్పందించిన మంత్రి మూడురోజుల కిందట ఆర్‌టిసి రీజినల్ మేనేజర్‌తో మాట్లాడి సమస్యను వివరించానని పేర్కొన్నారు. మరోమారు మాట్లాడి పాఠశాలకు అదనపు బస్సులు సమకూర్చుతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పేరెంట్స్ అసోసియేషన్ రెండవ డివిజన్ అధ్యక్షులు చంద్రగిరి నారాయణ, ట్రెజరర్ యల్. జితేంద్ర, సంయుక్త కార్యదర్శి పి.శాంసన్ అనిల్, రూట్ 2 కమిటీ కార్యదర్శి పి.మునీంద్ర, రూట్ 3 కార్యదర్శి విశ్వనాథ్,రూట్ 5 అధ్యక్షులు పి అంబేద్కర్,రూట్ 4 కార్యదర్శి వీర శేఖర ఆచారి ,కమిటీ సభ్యులు నరేంద్ర, నరసింహులు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ప్రిన్సిపల్‌ను సస్పెండ్ చేయాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - కడప అర్బన్ : ప్రిన్సిపల్ వేధింపులు భరించలేక ఆత్మహత్యాయత్నం చేసుకుని కడప రిమ్స్‌లో చికిత్స పొందుతున్న బయాలజీ అధ్యాపకురాలు జ్యోతి ని మంగళవారం ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరపోగు రవి, ఉపాధ్యక్షులు రాజశేఖర్ రెడ్డి, డివైఎఫ్ఐ నగర కార్యదర్శి విజయ్ పరామర్శించారు. ప్రిన్సిపల్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మైదుకూరు మండలం వనిపెంట ఉన్న బిసి గురుకుల పాఠశాలలో ప్రిన్సిపల్ గా పని చేస్తున్న నిర్మల వేధింపులు భరించలేక అక్కడే బోధిస్తున్న జ్యోతి అనే బయాలజీ అధ్యాపకురాలు ఆత్మహత్యాయత్నం చేసుకున్నారని వాపోయారు. ఎనిమిదేళ్లుగా ఎటువంటి అభియోగాలు లేకుండా ఉద్యోగం సక్రమంగా చేసుకుంటున్నా కులం పేరుతో, తక్కువ స్థాయితో ప్రతిసారి సూటిపోటి మాటలతో మాట్లాడుతూ వేధింపులకు గురి చేయడం ప్రిన్సిపల్‌కు తగదన్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి విచారణ చేపట్టి కారకులైన ప్రిన్సిపల్, ఇతర అధ్యాపకులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ఉదయ్, సాయి పాల్గొన్నారు.

పాడి పరిశ్రమతోనే కుటుంబ పోషణ

ప్రజాశక్తి-కాశినాయన :



అవగాహన కల్పిస్తున్న డిడి శ్రీనివాసులు

గ్రామాలలో పాడి పరిశ్రమతోనే వారి కుటుంబాలను పోషించు కోవచ్చని పశు వర్ధన శాఖ డిడి శ్రీనివాసులు రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పాడి పరిశ్రమ వారోత్సవాల్లో భాగంగా మండల పరిధిలోని గంగనపల్లెలో పాడి పరిశ్రమ రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి పరిశ్రమ వల్ల ఎంతో లాభాలు ఉన్నాయని, ప్రభుత్వం కూడా వారికి అనేక రకమైన సబ్సిడీలు మంజూరు చేసింది అన్నారు అందులో భాగంగానే వివిధ రకాల ఏక వార్షిక, బహువార్షిక పశు గ్రహసాల గురించి వివరించారు. బాలాపల్లె గ్రామంలో పాడి పరిశ్రమ, మహిళా సహకార సంఘం గురించి వివరించారు. కార్యక్రమంలో గంగనపల్లి సర్పంచ్ ప్రభాకర్ రెడ్డి, ఏడి చంద్రశేఖర్, నరసాపురం పశువైద్యాధికారి రామారావు, గురువిరెడ్డి సచివాలయ పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్ఆర్‌కు జగన్, షర్మిల నివాళి

- తల్లితో కలిసి వేర్వేరుగా ఇడుపులపాయలో ప్రార్థనలు



వైఎస్ఆర్ సమాధికి నివాళులర్పిస్తున్న జగన్



వైఎస్ఆర్ సమాధికి నివాళులర్పిస్తున్న షర్మిల

ప్రజాశక్తి - వేంపల్లె

మండలంలోని ఇడుపులపాయ వ్యవసాయ క్షేత్రంలో ఉన్న వైఎస్ఆర్ సమాధికి మాజీ సిఎం జగన్ మోహన్ రెడ్డి, పిసిసి అధ్యక్షులు షర్మిల వేర్వేరుగా ఘనంగా నివాళులర్పించారు. కీ.శే. వైఎస్ రాజశేఖర్ రెడ్డి 76వ జయంతి సందర్భంగా ఇడుపులపాయ వ్యవసాయ క్షేత్రానికి జగన్, షర్మిల విచ్చేశారు. ముందుగా రాజశేఖర్ రెడ్డి సతీమణి విజయమ్మ చేరుకున్నారు. జగన్ రాక ముందే తన భర్త సమాధి విజయమ్మ నివాళు అర్పించారు. అనంతరం జగన్ సతీమణి భారతి రాగా గతంలో మాదిరి కాకుండా చర్చి ఫాస్టర్ జగన్ రాక ముందే ప్రార్థనలు ప్రారంభించారు. ప్రార్థనలు నిర్వహించే సమయంలో 7.50 గంటలకు వైఎస్ఆర్ ఘాట్ వద్దకు కడప ఎంపీ అవినాష్‌రెడ్డితో కలిసి మాజీ సిఎం జగన్ మోహన్ రెడ్డి విచ్చేశారు. అరగంట పాటు ప్రార్థనలు చేసిన తర్వాత వైఎస్ఆర్ ఘాట్‌కు తల్లి విజయమ్మ, సతీమణితో కలిసి నివాళులర్పించారు. అనంతరం జగన్ తన తల్లి విజయమ్మను ప్రేమతో ఆలింగనం చేసుకొని ఆమె దీవెనలను తీసుకున్నారు. అనంతరం అక్కడి నుండి ఇడుపులపాయలోని గెస్ట్ హౌస్‌కు వెళ్లి అక్కడ నుండి పులివెందులకు బయలుదేరి వెళ్లారు. ఆయన వెళ్లిన తరువాత పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డితో కలిసి షర్మిల వైఎస్ఆర్ ఘాట్ వద్దకు చేరుకున్నారు. అ తల్లి విజయమ్మతో కలిసి ప్రార్థనలు చేసిన తర్వాత వైఎస్ఆర్ ఘాట్‌కు నివాళులర్పించారు. అలాగే వైఎస్ఆర్ విగ్రహన్నికి పూలమాలలు వేశారు. అనంతరం కాంగ్రెస్ నాయకులతో చర్చించారు.

అధైర్య పడకండి.. తోడుగా ఉంటా

- ప్రజాదర్బార్‌లో మాజీ సిఎం వై.ఎస్.జగన్

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

'అధైర్య పడకండి.. తోడుగా ఉంటాను, సమస్యలు ఉంటే నేరుగా నాతో చెప్పాలి, వచ్చే ఎన్నికల్లో గెలిచేది మనమే' అని మాజీ ముఖ్యమంత్రి , వైసిపి అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా మంగళవారం పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు ఆయన్ను కలిసి సమస్యలు వివరించారు. దీనికి జగన్ స్పందిస్తూ ప్రతి ఒక్కరికి న్యాయం జరిగే వరకు పోరాటం చేయడానికి సిద్ధంగా ఉన్నామని వారికి భరోసా ఇచ్చారు. ఇకపై ప్రతి ఒక్కరికి అందుబాటులో ఉంటానని నాయకులకు స్పష్టత ఇచ్చారు. చక్రాయపేట మండలంలోని గండి క్షేత్రం పునర్నిర్మాణ పనులు 95 శాతం పూర్తి అయ్యాయని, మిగిలిన ఐదు శాతం పనులు నిలిచిపోయానని ఆలయ చైర్మన్ కృష్ణ తేజ వైఎస్ జగన్ దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో కడప పార్లమెంట్ సభ్యుడు వైఎస్ అవినాష్ రెడ్డి, సతీష్ కుమార్ రెడ్డి వైసిపి నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.

చిరునవ్వుతో సమస్యలు వింటూ భరోసా ఇస్తూ

ప్రజా దర్బార్‌కు వచ్చిన ప్రజలు, వైసిపి నాయకుల సమస్యలను ఓపిగ్గా వింటూ , చిరునవ్వుతో ఆప్యాయంగా పలకరిస్తూ తోడుగా తానుంటానని వారికి భరోసా ఇచ్చారు. ప్రజలు ఈ సందర్భంగా సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. దీనికి ఆయన స్పందిస్తూ సమస్యలు పరిష్కారమయ్యే వరకు పోరాటం చేస్తానని, మనకు అన్యాయం జరిగితే న్యాయపరంగా ముందుకు వెళ్దామని, ఎవరు అధైర్య పడకుండా ముందుకు వెళ్లాలన్నారు. సాయంత్రం మూడు గంటల కు హెలికాప్టర్ ద్వారా బెంగళూరుకి బయలుదేరి వెళ్లిపోయారు.

జగన్ కలిసేందుకు పోటెత్తిన జనం

వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని కలిసేందుకు రాయలసీమ జిల్లాల నుంచి భారీగా జనం తరలివచ్చారు. వై.ఎస్?జగన్ క్యాంపు కార్యాలయానికి రాగానే వైసిపి నాయకులు కార్యకర్తలు 'రప్పా రప్పా , సిఎం.. సిఎం' అంటూ నినాదాలు చేశారు. ఆయన కలిసేందుకు భారీగా జనం తరలివచ్చారు. జగన్ కార్యాలయంతోపాటు ప్రాంగణం అంతా జనాలతో నిండిపోయింది. జనం రావడంతో వారిని అదుపు చేయలేక పోలీసులు నానా తంటాలు పడాల్సి వచ్చింది. వైసిపి ముఖ్యనేతలతో ముఖ్య నాయకులతో వైఎస్ జగన్ జిల్లా రాజకీయ విషయాలపై చర్చించినట్లు సమాచారం.



కార్యకర్తలతో మాట్లాడుతున్న జగన్

తోపులాటలోకిటికీల అద్దాలు ధ్వంసం..

మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి క్యాంప్ కార్యాలయం వద్ద ఉద్రిక్తత నెలకొంది. పులివెందుల పర్యటనలో భాగంగా మంగళవారం తన తండ్రి జయంతి సందర్భంగా నివాళులర్పించి పులివెందులలోని క్యాంపు కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించేందుకు వచ్చిన వెంటనే అక్కడికి వచ్చిన జనం జగన్ కలిసేదుకు భారీగా రావడంతో తోపులాట జరగడంతో కిటికీ అద్దాలు ధ్వంసం అయ్యాయి.

మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల వేతనాలు పెంచాలి : సిఐటియు

ప్రజాశక్తి - కడప అర్బన్

రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ ఇంజినీరింగ్ సెక్షన్ కార్మికుల వేతనాలు పెంచాలని సిఐటియు జిల్లా కార్యదర్శి రామమోహన్ డిమాండ్ చేశారు. మంగళవారం కోటిరెడ్డి సర్కిల్ ఎదుట మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంజినీరింగ్ కార్మికులను ప్రభుత్వం చిన్న చూపు చూస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు నిరంతరం సేవ చేసే పారిశుధ్య కార్మికులకు వేతనాలు పెంచి, ఇంజినీరింగ్ కార్మికులకు పెంచకపోవడం చాలా దుర్మార్గమని పేర్కొన్నారు. కేవలం రూ.13,087 తీసుకుంటున్న ఇంజినీరింగ్ కార్మికులకు తల్లికి వందనం అమలు చేయకపోవడం ప్రభుత్వ చేతగాని తనమని విమర్శించారు. రూ.25 వేల లోపల వేతనం వచ్చే వారికి సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇంజినీరింగ్ కార్మికులకు అన్యాయం చేయడం ప్రభుత్వానికి తగదన్నారు. జీవో నంబర్ 36 ప్రకారం రూ.24,500 ఇవ్వాలని, రిటైర్ మెంట్ బెనిఫిట్స్ రూ.75వేలు, వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, విరమణ వయసు 62 సంవత్సరాలు పెంచాలని పేర్కొన్నారు. 9న దేశ వ్యాప్తంగా నిర్వహించే సమ్మె లో పాల్గొని, 12న అర్ధ రాత్రి నుంచి కడప నగరంలో నీళ్ల, వీధి దీపాలతో పాటు మొత్తం కార్పొరేషన్ సేవలు అన్ని బంద్ చేస్తామని హెచ్చరించారు. దీనికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని చెప్పారు. న్యాయమైన సమస్యలు సిఎం పరిశీలించి పరిష్కరించాలని పేర్కొన్నారు. లేని పక్షం లో నిరవధిక సమ్మె లోకి వెళ్తామని హెచ్చరించారు. కార్యక్రమం లో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్, నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్ర రెడ్డి, వెంకటసుబ్బయ్య, మున్సిపల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.విజయ భాస్కర్, కోశాధికార గోపి, జిల్లా సహాయ కార్యదర్శి బ్రహ్మానంద రెడ్డి, సుబ్బారాయుడు, గురువయ్య, వెంకటేష గోవర్ధన్‌రెడ్డి, మోహన్ రెడ్డి, లక్ష్మయ్య, మహేశ్వర రెడ్డి, రామ్ చెన్నయ్య, ఆంజనేయులు, చంద్రాయుడు, సోమిరెడ్డి వీర్రా నారాయణ, జయ పుత్రుడు, హరి నాయక్. పాల కొండా రాయుడు. అజాముద్దీన్ బాషా. ప్రదీప్ కుమార్, రాంబాబు, సందీప్ సాగర్.రమేష్ బాబు.వెంకట సుబ్బయ్య, రమేష్, శివ, రవీంద్ర నాయక్, ఓబుల్ రెడ్డి, వెంకటేష్, ధైర్యం, భాస్కర్, కార్మికులు పాల్గొన్నారు.

అబ్దుల్ కలాం విగ్రహం ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - కడప అర్బన్



స్థలాన్ని పరిశీలిస్తున్న సలావుద్దీన్

కడప నగరం మహావీర్ సర్కిల్‌లోని ఆర్‌టిసి బస్టాండ్ రహదారిలో మాజీ రాష్ట్రపతి ఎపిజె అబ్దుల్ కలాం విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ముస్లిం సమైక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు, ప్రముఖ సంఘ సేవకులు సయ్యద్ సలావుద్దీన్ కోరారు. మంగళవారం స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలోనే పేరు ప్రఖ్యాతలు సంపాదించిన మిసైల్ మ్యాన్ మన భారత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం అన్నారు. ఆయన చేసిన సేవలను మరువలేమన్నారు. ఇటువంటి గొప్ప మహోన్నత వ్యక్తి విగ్రహం మన కడప నగరంలో లేకపోవడం చాలా బాధాకరమైన విషయం అన్నారు. జిల్లా అధికారులు వెంటనే స్పందించి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరారు.

కార్మికులపై అధికారుల వేధింపులు ఆపాలి

ప్రజాశక్తి-కడప అర్బన్



మాట్లాడుతున్న సుంకర రవి

మున్సిపల్ కార్మికులపై అధికారుల వేధింపులు ఆపాలని, కడప కార్పొరేషన్ పరిధి లోని మృతి చెందిన ఐదుగురి కార్మికుల కుటుంబాలకు ఇంతవరకు ఉద్యోగాలు ఇవ్వలేదని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) నగర అధ్యక్షులు సుంకర రవి పేర్కొన్నారు మంగళవారం పాత మున్సిపల్ కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగాల విషయంపై కమిషనర్‌ను అడిగితే ఉన్నతాధికారుల వద్ద పెండింగ్ ఉందని చెబుతూ సమ స్యను మాత్రం పరిష్కరించడం లేదని పేర్కొన్నారు. వెంటనే ఉద్యోగాలు ఇవ్వా లని డిమాండ్ చేశారు. అడిషనల్, కోవిడ్, కొత్త కార్మికులకు ఇఎస్ఐ, పిఎఫ్ వర్తింపజేయాలని పేర్కొన్నారు. అడిషనల్ కార్మికులకు ప్రస్తుత ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని చెప్పారు. సమస్యలు పరిష్కరించాలని కోరారు. నగరంలో కార్మికుల పైన అధికారుల వేధింపులు అధికమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళల చేత కాలువలు తీయించడం, ఎత్తించడం, డాక్టర్లకు లోడింగ్ చేయించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. జిల్లా కేంద్రంలో నిర్వహించే సార్వత్రిక సమ్మెకు మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ మద్దతు తెలియజేస్తుందని చెప్పారు. సమావేశంలో నగర వర్కింగ్ ప్రెసిడెంట్ కంచుపాటి శ్రీరామ్, సహాయ కార్యదర్శి ఇత్తడి ప్రకాష్, డ్రైవర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీధర్ బాబు, సుంకర కిరణ్, నగర కమిటీ సభ్యులు, రెగ్యులర్ ఉద్యోగుల సంఘం కార్యదర్శి తొండల మస్తాన్‌పాల్గొన్నారు.

ఓబులంపల్లిలో పొలం పిలుస్తోంది

ప్రజాశక్తి - చింతకొమ్మదిన్నె: మండలంలోని ఓబులంపల్లిలో మంగళశారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి కె.ఈశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ఖరీఫ్ 2025 ఏడాదికి గాను ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన(పంటల బీమా) వాతావరణ ఆధారిత బీమాలో పత్తికి రూ. 2 వేలు, వేరుశనగ రూ. 560, బత్తాయి రూ. 2750, అరటి రూ. 3025 ప్రీమియం చెల్లించాలన్నారు. ఈనెల 15 వరకు దిగుబడి ఆధారిత భీమా కింద వరి రూ. 84, కంది రూ.36, జొన్న రూ. 38, మినుము రూ. 38 , పసుపు రూ. 180, ఉల్లి రూ. 90 ఎకరానికి ఈనెల 31 వరకు చెల్లించవచ్చన్నారు. వరికి మాత్రమే ఆగస్టు 15 వరకు అవకాశం కల్పించారని పేర్కొన్నారు. రైతులు మూడు రకాలుగా ప్రీమియం ఉంచవచ్చు అని తెలిపారు చెప్పారు. రైతులు ప్రీమియం చెల్లించేటప్పుడు వన్ బి, ఆధార్‌కార్డు, బ్యాంకు పాస్‌పుస్తకం జిరాక్స్, మొబైల్ నంబర్ కౌలు ధ్రువీకరణ పత్రం తప్పని సరిగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంఐ ఎఒ శ్రీధర్‌రెడ్డి, గ్రామ వ్యవసాయ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

రక్తదాన వారోత్సవాల పోస్టర్లు ఆవిష్కరణ

ప్రజాశక్తి - వల్లూరు : కడప జిల్లా స్వచ్ఛంద సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 10 నుంచి 16 వరకు నిర్వహించే ద్వితీయ వార్షికోత్సవం రక్తదాన వారోత్సవాల పోస్టర్లును వల్లూరు మండలం రెవెన్యూ కార్యాలయంలో తహశీల్దార్ శ్రీవాణి మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ రక్తం ఆవశ్యకతను ప్రతి ఒక్కరూ దృష్టిలో ఉంచుకొని రక్తదానం చేసినందుకు ముందుకు రావాలన్నారు. 18 ఏళ్లు నిండిన యువతి, యువకులు, ప్రజలు, స్వచ్ఛంద సేవకులు ప్రతి ఒక్కరూ రక్తదాన వారోత్సవాల్లో పాల్గొని రక్తదానాన్ని ఇచ్చి ప్రాణాలను కాపాడాలన్నారు.



కరస్పాండెంట్ సంజీవరెడ్డిని సన్మానిస్తున్న అధ్యాపక సిబ్బంది

'సాహిత్య'కు సెమీ అటానమస్‌పై హర్షం

ప్రజాశక్తి - ఖాజీపేట

తమ కళాశాలకు సెమీ అటానమస్ హోదా రావడం పట్ల ఖాజీపేట సాహిత్య డిగ్రీ కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంగళవారం కళాశాలలో అధ్యాపకులు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కళాశాల కరస్పాండెంట్ సంజీవరెడ్డిని అధ్యాపక బృందం ఘనంగా సన్మానించింది. మెరుగైన ఫలితాలు సాధించడంతోపాటు విద్యా సంస్థను ఆదర్శవంతంగా తీర్చిదిద్దామని అధ్యాపకులు పేర్కొన్నారు. నాణ్యమైన విద్యను బోధించామన్నారు. ఉన్నత విద్యాశాఖ మండలి, విశ్వవిద్యాలయం అధికారులు తమ విద్యాసంస్థను గుర్తించి అటానమస్ హోదా కల్పించడం సంతోషకరమన్నారు. రానున్న రోజుల్లో కూడా ఉన్నత విద్యలో మరిన్ని సంస్కరణలు తీసుకువచ్చి ఆదర్శవంతమైన విద్యాబోధనను విద్యార్థులకు అందిస్తామన్నారు.



అన్నం వడ్డిస్తున్న తులసిరెడ్డి, దాతలు

అనాథ వృద్ధులకు అన్నదానం

ప్రజాశక్తి - వేంపల్లె

స్థానిక రాజీవ్ కాలనీలో ఉన్న అమ్మ అనాథ వృద్ధాశ్రమంలో మంగళవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వేముల మండలం నల్లచెరువుపల్లె గ్రామానికి చెందిన రామమునిరెడ్డి, సుశీలమ్మ దంపతుల కుమారుడు మాజీ సైనికుడు మునీంద్రకుమార్ రెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా అన్నదానం చేశారు. ముఖ్యఅతిథిగా పిసిసి అధికార ప్రతినిధి డాక్టర్ తులసిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రార్థించే పెదాల కంటే సేవ చేసే చేతులు మిన్న అని మదర్ థెరిస్సా అన్నారని తెలిపారు. అందులోనూ వృద్ధులకు, అనాథలకు సేవ చేయడం మరింత పుణ్యకార్యం అన్నారు. మాజీ సైనికుడు మునీంద్రకుమార్ రెడ్డి ప్రథమ వర్ధంతి వేడుకలను వృద్ధుల మధ్య జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో మునికుమారి, చిన్న దస్తగిరిరెడ్డి, కృష్ణవేణి, గంగాధరరెడ్డి, రామసుబ్బమ్మ ఆశ్రమ నిర్వాహకుడు వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

సిఎం సహాయనిధిని సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ముఖ్యమంత్రి సహాయనిధిని పేద రోగులు సద్వినియోగం చేసుకోవాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డి సూచించారు. ప్రొద్దుటూరు నియోజకవర్గంలోని 32 మంది రోగులకు రూ.27,93,573 సిఎం సహాయనిధి నుండి మంజూరైన చెక్కులను రోగుల కుటుంబ సభ్యులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి సహాయ నిధికి పెద్ద మొత్తంలో నిధులు వెచ్చిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మాజీ టిడిపి పట్టణ అధ్యక్షుడు ఘంటసాల వెంకటేశ్వర్లు, కౌన్సిలర్ జిలాన్, మైనారిటీ నాయకులు నూరి, గఫార్, రసూల్ గౌస్ పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదాలు

ప్రజాశక్తి - ఖాజీపేట

మండల పరిధిలోని కోటం గురువాయపల్లె వైఎస్ఆర్ విగ్రహం సమీపంలో వాగుపై నిర్మించిన కల్వర్టు గోడలు పూర్తిగా దెబ్బ తిన్నాయి. ఈ మార్గంలో ప్రతినిత్యం అధిక సంఖ్యలో వాహనాల రాకపోకలు సాగిస్తూ ఉంటారు. కల్వర్టుకు వైపున రక్షణ కూడా లేకపోవడంతో వాహనదారులు ఏమాత్రం ఆజాగ్రత్త వహించినా వాగులో పడే ప్రమాదం ఉందని పలువురు ఆందోళన వ్యకతం చేస్తున్నారు. విద్యార్థులు పాఠశాలకు సైకిల్‌పై కూడా వెళు తుంటారు. వాహనాలు ఎదురెదురుగా వస్తున్న సమయంలో రాకపోకులకు సమస్యగా మారిందని వాహనదారులు తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కల్వర్టుకు ఇరువైపులా రక్షణ ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.



కల్వర్టుకు ఓవైపున దెబ్బతిన్న రక్షణ గోడ

క్రైం కార్నర్

కదులుతున్న రైలు దిగబోయి తల్లీకూతుళ్లకు గాయాలు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

పట్టణంలోని రైల్వేస్టేషన్‌లో కదులుతున్న రైలు నుంచి ఇద్దరు మహిళలు దిగబోయి గాయాల పాలైన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. ప్రొద్దుటూరుకు తల్లి, తండ్రి, కూతురు ముగ్గురు ధర్మవరం వెళ్లేందుకు రైల్వే స్టేషన్‌కు వచ్చారు. పొరపాటున తల్లి, కూతురు వేరే రైలు ఎక్కారు. తండ్రి గమనించి వారిద్దరినీ రైలు దిగాలని అనడంతో దిగేలోపు రైలు కదలడంతో కిందపడి గాయపడ్డారు. స్థానిక ఆర్‌పిఎఫ్ ఎఎస్‌ఐ సలాం, హెడ్ కానిస్టేబుల్ సుబ్బరాయుడు గమనించి వారిని 108 వాహనంలో ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



గాయపడినవారిని 108లో ఆస్పత్రికి తరలిస్తున్న పోలీసులు

తాగునీటి సమస్య తీర్చాలని మహిళల నిరసన



ఆందోళన చేస్తున్న మహిళలు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

తమకు తాగునీటి సమస్య తీర్చాలని మండలంలోని చిలమకూరు గ్రామ సానానగర్ మహిళలు మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ సానానగర్‌లో ఏడు నెలల క్రితం వీధి రోడ్లు వేసేందుకు పనులు మొదలుపెట్టారని, ఈ క్రమంలో పాత రోడ్లన్నీ తవ్వి తొలగించారన్నారు. ఈ తవ్వకాల్లో నీటి పైపులైన్‌లు దెబ్బతిన్నాయని తెలిపారు. మురుగు కాలువలు నిర్మించి వాటికి కప్పులు కూడా వేయకుండా వదిలివేశారని ఆందోళన వ్యక్తం చేశారు. వీధి రోడ్లు వేయలేదన్నారు. తొలి దశలోనే పనులు నిలిచిపోయాయని పేర్కొన్నారు. దెబ్బతిన్న పైప్‌లైన్లకు మరమ్మతులు చేయకపోవడంతో నీరు రావడంలేదన్నారు. వారానికి ఒకరోజు కొన్ని పైప్‌లైన్‌లకు అరకొరగా నీరు వదులుతున్నారని తెలిపారు. తీవ్రంగా ఉన్న నీటి సమస్యను అధికారులకు, ప్రజాప్రతినిధులకు తెలిపినా, రాతపూర్వక ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడంలేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. తాత్కాలికంగా ట్యాంకర్లు పంపిస్తామని చెప్పి ఒక రోజు పంపించి తర్వాత పంపించడం లేదని వాపోయారు. మురుగు కాలువలకు కప్పు వేయకపోవడం వల్ల చాలామంది పిల్లలు, పెద్దలు పడి గాయాల పాలవుతున్నారని తెలిపారు. వెంటనే నీటి సమస్యను పరిష్కరించాలని అధికారులను వేడుకున్నారు. ఎర్రగుంట్లలో విధులు నిర్వహిస్తున్న విఆర్ఒ రాణి మాట్లాడుతూ తాను కూడా చిలమకూరు గ్రామం సాన నగర్లోనే నివాసం ఉంటున్నానని, నీటి కరువుతో స్థానికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు.

డికెటి పట్టాలిచ్చి ఆన్‌లైన్‌లో హద్దులు చూపాలి

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

అర్హులైన వారికి డికెటి పట్టాలిచ్చి ఆన్‌లైన్‌లో హద్దులు చూపాలని సిపిఎం మండల కార్యదర్శి గండి సునీల్‌కుమార్ డిమాండ్ చేశారు. మండలంలో అసైన్‌మెంట్ ద్వారా పేదలకు ఇచ్చిన డికెటి పట్టాలను రద్దు చేయడాన్ని ఖండిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సునీల్‌కుమార్ మాట్లాడుతూ 2002, 2007, 2008లో ఎస్సీ, బీసీ, ఓసిలకు అసైన్‌మెంట్‌లో అర్హులైన పేదలకు ఇచ్చిన డికెటి పట్టాలు రద్దురయ్యాయని రెవెన్యూ అధికారులు చెప్పడం చాలా దుర్మార్గమన్నారు. కొంతమంది రాజకీయ నాయకులు, ఆర్థిక బలం కలిగిన వారివి మాత్రం నేటికీ ఆన్‌లైన్‌లో కొనసాగుతున్నాయని తెలిపారు. రెవెన్యూ అధికారులకు వారి ఆన్‌లైన్ తొలగించే బాధ్యత లేదా ప్రశ్నించారు. నేటికీ పేదవాడు తమకు భూములు దక్కుతాయంటూ కొండంత ఆశతో ఎదురు చూస్తుంటే నిరాశే మిగులుతోందన్నారు. బోగస్ ఆన్‌లైన్‌పై అధికారులు పూర్తి స్థాయిలో విచారిస్తే అనేక విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉం దన్నారు. రెవెన్యూ కార్యాలయంలో చాలా రికార్డులు కూడా తారుమారు అయ్యాయని, వీటిపై కూడా ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టాలన్నారు. అధికారులు పేదల పట్టాలకు హద్దులు చూపాలని కోరారు. ఎమ్మెల్యే సుధాకర్ యాదవ్ భూ సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు.



తహశీల్దార్‌కు వినతిపత్రమిస్తున్న సిపిఎం నాయకులు

ఘనంగా వైఎస్ఆర్ జయంతి

ప్రజాశక్తి - ముద్దనూరు

దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్.రాజశేఖర్‌రెడ్డి 76వ జయంతి సందర్భంగా స్థానిక వైసిపి కార్యాలయంలో మంగళవారం మండల అధ్యక్షులు నడమల శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి పాలాభిషేకం, కేక్ కట్ చేశారు. పిహెచ్‌సిలో రోగులకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మధుసూదన్ రెడ్డి, రామరెడ్డి, భాస్కర్ రెడ్డి, తిరుమలరెడ్డి, గోపాల కృష్ణయ్య, పరమేశ్వర రెడ్డి, నాగమనాయుడు, కిరణ్, రమణ యాదవ్, ప్రతాప్, మునెయ్య, సూర్యముని రెడ్డి, శేఖర్ రెడ్డి పాల్గొన్నారు. **ఖాజీపేట :** వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతిని వైసిపి నాయకులు, అభిమానులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. పలుచోట్ల వైఎస్ విగ్రహాలకు పాలాభిషేకం చేసి, పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. బి.కొత్తపల్లె పంచాయతీలో మైదుకూరు నియోజకవర్గం రైతు విభాగం అధ్యక్షులు జి.నాగిరెడ్డి ఆధ్వర్యంలో కుమ్మరికొట్టాలు, తిప్పాయపల్లె, బక్కాయపల్లెల్లో రాజశేఖరడ్డి విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తవ్వా ప్రవీణ కుమార్ రెడ్డి, రామసుబ్బారెడ్డి, ములపాకు మునిరెడ్డి, రాజారెడ్డి, బీరం రమణారెడ్డి, పుల్లారెడ్డి పాల్గొన్నారు. సుంకేసులలో వైసిపి జిల్లా జాయింట్ సెక్రెటరీ పివి రాఘవరెడ్డి, మండల కన్వీనర్ మురళీమోహన్ రెడ్డి, సర్పంచులు రెడ్యం రామకృష్ణారెడ్డి, భూమన సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో వైఎస్ విగ్రహానికి నివాళులర్పించారు. **వేముల :** రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలను వైసిపి మండల కన్వీనర్ నాగేళ్ల సాంబశివారెడ్డి, జెడ్పిటిసి కోకటం వెంకట బయపు రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. వైఎస్ చిత్ర పటాలకు పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. కేక్ కట్ చేసి, స్వీట్లు పంచి పెట్టారు. కార్యక్రమంలో ఎంపిపి చల్లా గంగాదేవి, మాజీ పొల్యూషన్ బోర్డ్ డైరెక్టర్ మరక కృష్ణారెడ్డి, మాజీ జెడ్పిటిసి నాగేళ్ల సత్య ప్రభావతమ్మ, రమాదేవి, ఉపాధ్యక్షులు ఎన్.గంగాధర, శ్రీరామి రెడ్డి, చలపతి, రాధా, చల్లా వెంకట నారాయణ, గొందిపల్లె రామాంజనేయులు, చాగలేరు రెడ్డయ్య, వేమ నారాయణరెడ్డి, కో-ఆప్షన్ సభ్యులు మండి మాపీర, రమేష్, నాగప్ప, రామసుబ్బారెడ్డి, భాస్కర్ రెడ్డి, ప్రకాష్‌రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు. **సింహాద్రిపురం :** రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలు మాజీ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి, ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. జిల్లా పార్టీ చేనేత విభాగం కార్యదర్శి ఈశ్వరయ్య ఆధ్వర్యంలో బియ్యం పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైసిపి మండల ఇన్‌ఛార్జి శ్రీకాంత్‌రెడ్డి, వెన్నపూస రాజగోపాల్‌రెడ్డి, బిఎన్ బ్రహ్మనందరెడ్డి, జాఫర్, అరవిందనాథరెడ్డి పాల్గొన్నారు. **చాపాడు :** ప్రజలు మెచ్చిన నాయకులు వైఎస్ఆర్ అని మాజీ ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి పేర్కొన్నారు. వైఎస్ జయంతి సందర్భంగా మైదుకూరులో మాజీ ఎమ్మెల్యే ఆధ్వర్యంలో వైఎస్ఆర్ విగ్రహానికి పూలదండ వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో చాపాడు ఎంపిపి టి లక్షుమయ్య, దువ్వూరు ఎంపిపి జయచంద్రారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ షరీఫ్, మూలె భరత్‌కుమార్ రెడ్డి, వైసిపి నాయకులు ఆర్‌వి సుబ్బారెడ్డి, శంకర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు. **ఎంపిపి టి.లక్షుమయ్య ఆధ్వర్యంలో** వైఎస్ఆర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు కిశోర్‌కుమార్ రెడ్డి, శాంతరాజు, జయసుబ్బారెడ్డి, మల్లి ఖార్జునరెడ్డి, రాజు, నవీన్ పాల్గొన్నారు. గుంత చియ్యపాడులో ఎంపిటిసి సుబ్బరామిరెడ్డి, మాజీ ఎంపిటిసి మహేష్ యాదవ్ ఆధ్వర్యంలో వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. **పులివెందుల రూరల్ :** వైఎస్ జయంతి వేడుకలను పులివెందులలో ఘనంగా నిర్వహించారు. ప్రధాన రహదారుల్లో వైఎస్ విగ్రహాలకు పులివెందుల వైసిపి మున్సిపల్ ఇన్‌ఛార్జి వైఎస్ మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో పూలమాలలు వేసి, కేక్‌లు కట్ చేసి ఘనంగా నివాళులర్పించారు. జిజిహెచ్ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బెడ్లు పంపిణీ చేశారు. అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. పట్టణంలోని పార్నపల్లి రోడ్డు ప్రధాన రహదారుల్లో వైఎస్ఆర్ విగ్రహం వద్ద తుమ్మలపల్లి సర్పంచ్ గజ్జల అనూష మహేశ్వర్ రెడ్డి ఏర్పాటుచేసిన భారీ కేక్‌ను పార్టీ నల్లపురెడ్డిపల్లి సీనియర్ నాయకుడు బలరామిరెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ చిన్నప్ప కట్ చేసి, పంచిపెట్టారు. కార్యక్రమంలో హేమంత్‌రెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ కంచర్ల సర్వోత్తమ్ రెడ్డి, వైసిపి నాయకులు ఉన్నారు. **వేంపల్లె :** వేంపల్లెలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలను వైసిపి నాయకులు ఘనంగా నిర్వహించారు. వైసిపి మండల కన్వీనర్ ఆధ్వర్యంలో జడ్పిటిసి ఎం. రవికుమార్ రెడ్డి, వైసిపి మండల ఉపాధ్యక్షులు మునీర్‌బాషా, రవి శంకర్ గౌడ్, సర్పంచ్ ఆర్.శ్రీనివాసులు నాయకులతో కలిసి వేంపల్లెలో ఉన్న వైఎస్ఆర్ విగ్రహాలకు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పాత గండి రోడ్డులోని నాగమ్మ నగర్‌లో ఉన్న మదర్ థెరిస్సా చారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేసిన వృద్ధాశ్రమంలో అల్పాహారం ఏర్పాటు చేశారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ ఎంపీటీసీ కుర్రాకుల వెంకటేష్, కుమ్మరాంపల్లె సర్పంచ్ మునేష్, షాదిఖానా కమిటీ మాజీ చైర్మన్ షేక్షావలి, మాజీ సర్పంచ్ ఆర్ఎల్‌పి ప్రసాద్‌రెడ్డి, ఎంపీటీసీలు కటిక చంద్రశేఖర్, ఎంహెచ్ హబీవుల్లా, నాయ కులు రవి, శ్రావణ్, కటిక నాగేంద్ర, బండల సుకూర్, ఆది నారాయణ రెడ్డి, సునీల్, బాలాజీ, సుధాకర్, శ్రీనివాసులు రెడ్డి, మధు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

పురోగతికి ప్రణాళికలు సిద్ధం చేయాలి

ప్రజాశక్తి - చాపాడు

గ్రామ పంచాయతీల పురోగతికి సిబ్బంది సమన్వయంతో ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎంపిడిఒ వీరకిషోర్ సూచించారు. మండల సభా భవనంలో మంగళవారం మండలస్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లుకు 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీల అభివృద్ధిలో భాగంగా ప్రజల అవసరాలు, ఆదాయ వనరులను గుర్తించాలన్నారు. తాగునీరు, డ్రెయినేజీ, పరిశుభ్రత వంటి అంశాల పట్ల ప్రజలకు నిత్యం అవగాహన కల్పించాలన్నారు. గ్రామపంచాయతీ నిధులను ఉపయోగించుకొని పంచాయతీల అభివృద్ధికి చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం ట్రైనర్లు జానకిరామ్ సిబ్బందికి గ్రామ పంచాయతీల ప్రణాళికపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ సుబ్బరత్నమ్మ, హౌసింగ్ ఎఇ ప్రమోద్ కుమార్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ మహమ్మద్, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపిడిఒ వీరకిషోర్



మాట్లాడుతున్న ఎంపిడిఒ రాధాకృష్ణవేణి

ఉత్తమ గ్రామ పంచాయతీలుగా నిలపాలి

ప్రజాశక్తి - ముద్దనూరు

వివిధ రంగాల్లో అభివృద్ధి సాధించి ఉత్తమ గ్రామ పంచాయతీలుగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని ఎంపిడిఒ రాధాకృష్ణవేణి సూచించారు. స్థానిక మండల ప్రజా పరిష్యత్ కార్యాలయ సభా భవనంలో మంగళవారం ఎంపిడిఒ ఆధ్వర్యంలో పంచాయతీ పురోగతి సూచికపై మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్, డిజిటల్ అసిస్టెంట్లు, ఎఎన్ఎంలకు ఒక్కరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2023-24 సంవత్సరానికి సంబంధించి ఆయా శాఖల వారు అన్ని గ్రామ పంచాయతీల్లో సాధించిన పురోగతిపై గ్రామ స్వరాజ్ పోర్టల్లో వివరాలు నమోదు చేయాలని సూచించారు. వివిధ రంగాల్లో అభివృద్ధి సాధించి ఉత్తమ గ్రామ పంచాయతీలుగా నిలిపేందుకు కృషి చేయాలన్నారు. డిప్యూటి తహశీల్దార్ వరద కిషోర్ రెడ్డి, డిప్యూటీ ఎంపిడిఒ కె.వీరభద్రుడు, హౌసింగ్ ఎఇ ప్రతాప్‌రెడ్డి, పశు వైద్యాధికారి వాసా శ్రీనివాస, పరిపాలనా అధికారి పరిపూర్ణ అరుంధతి పాల్గొన్నారు.

ఆదాయ వనరులపై దృష్టి సారించండి

ప్రజాశక్తి - సింహాద్రిపురం

పంచాయతీ పరిధిలో ఆదాయ వనరులపై దృష్టి సారించాలని ఎంపిడిఒ శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. మంగళవారం ఎంపిడిఒ కార్యాలయ సభా భవనంలో పంచాయతీ పురోగతి సూచిక వర్షన్ 2.0 శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పన్నుల వసూళ్లపై ప్రత్యేకశ్రద్ధ పెట్టాలన్నారు. మెడికల్ ఆఫీసర్ కుమార్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పంచాయతీ అధికారులకు సూచించారు. అంతకుముందు మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎఒ కల్యాణ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, మండల అధికారులు పాల్గొన్నారు.

పంటల బీమా రైతుకు ధీమా

పులివెందుల రూరల్ : పంటల బీమా రైతులకు ధీమా అని ఎం వి.చెన్నారెడ్డి సూచించారు. చిన్న రంగాపురంలో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్ర మంలో ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకం (పిఎంఎఫ్‌బివై) గురించి రైతులకు అవగాహన కల్పిం చారు. ఖరీఫ్ సీజన్‌లో పంటల బీమాకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం విధి విధానాలను ప్రకటించిందన్నారు. 2025 ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటలకు బీమా చేసుకొనుటకు అనుమతి (నోటిఫైడ్) పొందిన పంటలకు ప్రీమియం చెల్లించాలని రైతులను కోరారు. **వేముల :** శేషన్నగారిపల్లి, బెస్తవారిపల్లి పంచాయతీల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎఒ జిపి ఓబులేసు మాట్లాడుతూ పంటల ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించాలని రైతులకు సూచించారు. ప్రధాన పంటల్లో సస్యరక్షణ పద్ధతులు పాటించి, మంచి దిగుబడులు సాధించాలని కోరారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధాకర్ యాదవ్

పండ్ల తోటల సాగుకు ప్రభుత్వ ప్రోత్సాహం

ప్రజాశక్తి - ఖాజీపేట

ప్రభుత్వం వ్యవసాయాన్ని, వాటి అనుబంధ రంగాలను పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తోందని, రైతులు పండ్ల తోటల సాగువైపు దృష్టి పెట్టి అధిక ఆదాయం పొందాలని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ సూచించారు. మండల పరిధిలోని నాగపట్నం గ్రామంలో మంగళవారం రైతులకు పండ్లతోటల మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు పండ్ల తోటల సాగు చేసుకోవడానికి ముందుకు రావాలన్నారు. ప్రభుత్వం ఆమలు చేస్తున్న పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిడిఒ దివిజా, ఎపిడి సుబ్బారెడ్డి, ఎపిఒ చంద్రశేఖర్, టిడిపి నాయకులు రామసుబ్బయ్య, పుల్లయ్య నాయుడు, పత్తూరు ఉప సర్పంచ్ ముత్తూరు రమణ, రామానాయుడు పాల్గొన్నారు.



పి.వెంకటాపురంలో పర్యటిస్తున్న భూపేష్ రెడ్డి, టిడిపి నాయకులు

ప్రజలు మెచ్చేలా కూటమి పాలన

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

రాష్ట్ర ప్రజలు మెచ్చేలా కూటమి పాలన సాగుతోందని జమ్మలమడుగు నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జి భూపేష్ సుబ్బరామిరెడ్డి తెలిపారు. మండలంలోని పి వెంకటాపురంలో మంగళవారం సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి తిరిగి కూటమి ప్రభుత్వం సంవత్సర కాలంలో చేసిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. అనంతరం ఎంపిపి పాఠశాలను సం దర్శించి విద్యార్థులతో మాట్లాడారు. పాఠశాలలో వసతుల గురించి, మధ్యాహ్న భోజనం గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మండల కూటమి అధ్యక్షులు మధుసూదన్‌రెడ్డి, మండల టిడిపి అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, కూటమి నాయకులు బ్రహ్మనంద రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, రామకృష్ణారెడ్డి, గోపాల్ యాదవ్, నాగిరెడ్డి, సుబ్బారెడ్డి, రమణారెడ్డి, నాగేంద్ర, చంద్రబాబు రెడ్డి, వీరారెడ్డి పాల్గొన్నారు.

గత ప్రభుత్వ విధ్వంసం వల్లే పథకాల అమలుకు జాప్యం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

గత ప్రభుత్వ ఆర్థిక విధ్వంసం వల్లే పథకాల అమలులో కొంత జాప్యం జరుగుతోందని టిడిపి రాష్ట్ర కార్యదర్శి కొండారెడ్డి తెలిపారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి పిలుపు మేరకు కొత్తపల్లె పంచాయతీ పరిధిలోని వివేకానంద కాలనీలో మంగళవారం సుపరిపాలనలో తొలి అడుగు ఇంటింటి ప్రచార కార్యక్రమం ఎన్.కొండారెడ్డి, మాజీ ఎంపిపి ఎన్.రాఘవరెడ్డి నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, టిడిపి పట్టణ అధ్యక్షుడు ఇవి సుధాకర్‌రెడ్డి, జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు కొనిరెడ్డి శివచంద్రారెడ్డి, టిడిపి జిల్లా కార్యదర్శి సిద్ధారెడ్డిగారి నాగముని రెడ్డి, రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ నల్లబోతుల నాగరాజు, జిల్లా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు బద్వేలు శ్రీనివాసుల రెడ్డి, మాజీ టిడిపి పట్టణ అధ్యక్షుడు ఘంటసాల వెంకటేశ్వర్లు, స్థానిక నాయకులు చిట్టిబోయిన గంగాధర్, బత్తల సుమంత్, శివ, ఆవుల నడిపి దస్తగిరి, హసీనా, వార్డు సభ్యులు కొనిరెడ్డి హర్ష, ఇస్మాయిల్, ఎంపీటీసీ సౌభాగ్యమ్మ పాల్గొన్నారు.

బాలిక కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటాం

- పులివెందుల టిడిపి ఇన్‌ఛార్జి రవీంద్రనాథ్‌రెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

మండలంలోని పక్కీర్ పల్లెకు చెందిన బాలిక కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని పులివెందుల టిడిపి ఇన్‌ఛార్జి బిటెక్ రవీంద్రనాథ్ రెడ్డి పేర్కొన్నారు. కడప రిమ్స్‌లో చికిత్స పొందుతున్న సుమియా అనే బాలికను మంగళవారం ఆయన పరామర్శించారు. గొర్రెలను మేపు కునేందుకు వెళ్లిన బాలికను కొందరు యువకులు వెంబడించడంతో బాలిక కొండ ప్రాంతాలోకి వెళ్లిపోయింది. కొన్ని గంటల పాటు కనిపించలేదు. ఈ క్రమంలో పోలీసులు రంగప్రవేశం చేసి బాలిక సుమియాను తల్లిదండ్రులకు అప్పగించడంపాటు చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న బిటెక్ రవి కడప రిమ్స్‌కు వెళ్లి సుమియాను పరామర్శించడంతోపాటు బాలిక కుటుంబ సభ్యులను సంఘటనపై అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం చేయాలని వైద్యులను కోరారు. నిందితులను కఠినంగా శిక్షించేందుకు పోలీసులు చర్యలు తీసుకుంటారని బాలిక తల్లిదండ్రులకు హామీ ఇచ్చారు. పోలీసుస్టేషన్‌పై అల్లరి మూకలు దాడి చేయడం సరైంది కాదన్నారు. పోలీసుల పని తీరుకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి మండల పరిశీలకుడు రఘునాథ్‌రెడ్డి, టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి, ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్, డక్క రమేష్, మహమ్మద్ ఇనాయతుల్లా, వేమా కుమార్, నాయకులు పాల్గొన్నారు.